
**కథ**



# గతానికి తాళలేము

## కాశీభట్ల శశికాంత్

మేనేజర్ ఛాంబర్లోకి వెళ్ళాడు ముకుందం. ఏదో ఫైల్ చూస్తున్న మేనేజర్ అతని రాకని పట్టించుకోలేదు. ముకుందం అలాగే నుంచున్నాడు. కొద్దిసేపటికి మేనేజర్ తలెత్తి అతని కేసి చూశాడు.

''సాగర్ ఎంటర్‌ప్రైజస్ వాళ్ళ ఫైల్ తీసుకురమ్మన్నారు కద సార్'' అని చేతిలో ఉన్న ఫైల్‌ని మేనేజర్ గారి ముందు పెట్టాడు ముకుందం దగ్గుతూ. మేనేజర్ ముకుందంకేసి చిరాకుగా చూసి ఫైలుని చేతుల్లోకి తీసుకున్నాడు.

''వెరీగుడ్...నెల రోజులుగా ఈ ఫైల్‌ని రేక్‌లో భద్రంగా ఉంచారన్నమాట'' వ్యంగ్యంగా అన్నాడు మేనేజర్.

''ఫోన్‌లో అడిగాను సార్. డి.డి. పంపించేస్తాం అన్నారు'' వినయంగా అన్నాడు ముకుందం.

''వాళ్ళు చెప్పారు..మీరు నమ్మేసారు. ఇంతకాలమైనా డి.డి. రాకపోతే లెటర్ రాయక్కరలేదా? ఎందుకండీ మీ సీనియార్టీ''

''వాళ్ళు పేమెంట్స్‌లో చాలా ప్రాంప్ట్‌గా ఉంటారు సార్. ఈసారెందుకనో లేటైంది'' నసిగాడు ముకుందం.

''నాకు కావలిసింది పని. మీ అభిప్రాయం కాదు. ఎమ్.డి.గారు అడుగుతున్నారు. ఏం సమాధానం చెప్పమంటారు?'' కోపంగా అన్నాడు మేనేజర్.

''సారీ సార్..ఇప్పుడే లెటర్ పంపిస్తాను''

''ఆ... చైతన్య వాళ్ళకి పంపిన స్టాక్‌లో ఏదో తేడావచ్చిందన్నారని చెప్పాను కదా... చూశారా?''

''ఈరోజు చూస్తాన్సార్''

''ఏం చూస్తారో ఏమో. ప్రతిపనికి పిలిచి గుర్తుచేస్తేనే కానీ మీ సీట్లో ఫైల్స్ కదలవు. మీ పనులు గుర్తు చేయడానికా నేనున్నది?''

''సారీ సార్...రెండు రోజులు లీవ్‌లో ఉండటం వలన కొద్దిగా వర్క్ పెండింగ్‌లో పడింది''

''ఈ మధ్యనే ఒంట్లో బాగాలేదని నాలుగురోజులు లీవ్ పెట్టారు. మళ్ళీ ఇప్పుడు రెండురోజులు. ఇంక పనేం అవుతుంది?''

''పెద్ద వయసు కద సార్.. ఏదో అనారోగ్యం''

''అయితే మీలాంటివాళ్ళు నలుగురు ఆఫీసులో ఉంటే ఇంక అన్ని పనులు మేమే చేసుకోవాలన్న మాట. ఏజ్‌తో పాటు శాలరీ కూడా పెరుగుతోంది కదా... మరి పనెందుకు తగ్గాలి. ఇంకెప్పుడూ ఇలాంటి కారణాలు చెప్పకండి. వర్క్ పెండింగ్ పెడితే నేను టోలరేట్ చెయ్యను. పెద్దవాళ్ళు... మాటిమాటికి నా చేత చెప్పించుకోకండి.. వెళ్ళండి'' చిరాకుగా అన్నాడు మేనేజర్.

***

''ఏమంటున్నాడు?'' లంచవర్లో అడిగాడు విశ్వనాథం

''ఆయనకి నా పొడ అస్సలు గిట్టడం లేదు. నన్ను చూడగానే మొహం చిట్లించేస్తున్నాడు''

మీరు శలవలు ఎక్కువగా పెడుతున్నారని, వర్క్ స్లోగా చేస్తారని, మీ సీట్లో ఫైళ్ళు ఒక పట్టాన కదలవని



అందరి దగ్గరా అంటున్నాడు''

''ఊరికినే ఎందుకు పెడతాను శలవలు. ఒకప్పుడు నేను కూడా రెగ్యులర్‌గానే ఉండేవాడిని, స్పీడ్‌గా వర్క్ చేసేవాడిని. ఎప్పుడూ ఒకేలా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు.''

''గతంలో మీరు పడ్డ కష్టం గురించి ఈయనకి తెలుసా ఏమన్నానా? ఒకవేళ తెలిసినా బాస్‌లకి వర్తమానమే ముఖ్యం''.

''ఈయన వ్యవహారం చూస్తుంటే పొమ్మన లేక పొగబెట్టినట్లుంది''

అసలా అవకాశం ఆయనకెందుకివ్వాలి? అమ్మాయి పెళ్ళి చేసేసారు. అబ్బాయి చక్కగా ఉద్యోగం చేసుకుంటున్నాడు. స్వంత ఇల్లుంది. పెన్షన్ కూడా బాగానే వస్తుంది. హాయిగా రిజైన్ చేసి రెస్ట్ తీసుకోవచ్చుగా. మీ ఆరోగ్యం కూడా అంతగా బాగుండటం లేదు.''

''ఏదో కొద్దిగా అనారోగ్యం అంతే. ఈయనేదో అన్నాడని పౌరుషానికి పోయి, రెండేళ్ళ సర్వీసుని ఎందుకు వదులుకోవాలి?''

''వదులుకోకపోతే రోజూ ఇలాగే సాధిస్తూ ఉంటాడు. మీకు ఏం సుఖంగా ఉంటుంది?''

''అదీ చూస్తాను. ఈయన పద్ధతి మారకపోతే రమేష్ గార్ని కలుస్తాను''

''ఎమ్.డి. గారినా? ఎందుకు?''

''డిపార్ట్‌మెంట్లో ప్రోబ్లమ్స్ ఉంటే మేనేజర్‌కి చెప్పుకుంటాం. అయనే ప్రోబ్లెమేటిక్ అయితే మేనేజ్‌మెంట్‌కేగా చెప్పుకోవలసింది''

''బాగుంది... వాళ్ళు ఇలాంటివి వినడం మొదలుపెడితే అందరూ క్యూ కడతారు''

''అందరికీ వాళ్ళు అవకాశం ఇవ్వరు. నా సంగతంటే వేరు. జగన్నాథం గారికి ఆ రోజుల్లో నేనెంత కష్టపడ్డానో బాగా తెలుసు. ఆయన కంపెనీ బాధ్యతలని రమేష్‌గారికి అప్పజెప్పేటప్పుడు నన్ను, ఈ కంపెనీకి ఒక ఎస్సెట్‌గా పరిచయం చేసారు...తెలుసా. అటు వంటి వాడిని ఈరోజు లయబిలిటీ అయి పోయానన్నమాట.''

''ఈ విషయంలో ఎమ్.డి. గారిని కలిసే ప్రయత్నం మాత్రం చెయ్యకండి. ఆ సంగతి మేనేజర్‌గారికి తెలిస్తే మీ పని పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే'' హెచ్చరించాడు విశ్వనాథం

***

''ఏరా ముకుందం...ఈ మధ్య కనిపించడం లేదు'' సూపర్ బజార్లో కలిసిన రాజారావు అడిగాడు.

''మామూలే...ఏదో పనుల ఒత్తిడి...మీ అబ్బాయి ఎలా ఉన్నాడు?''

''బాగానే ఉన్నాడు'' అన్నాడు రాజారావు చేతిసంచీతో బయటకు నడుస్తూ. ఇద్దరూ రోడ్డు మీద నడవసాగారు.

''వయస్సుని మించి పెద్దవాడిలాగ కనబడు తున్నావు. ఏం...ఒంట్లో బాగుండటం లేదా?'' అన్నాడు రాజారావు.

''ఇప్పుడు బాగానే ఉందిలే. మిగిలిన రెండేళ్ళ సర్వీసు ఏదో ఒకలా కంప్లీట్ చెయ్యాలని నా కోరిక. కానీ, మా మేనేజర్ చెయ్యనిచ్చేలా లేడు'' విచారంగా అన్నాడు ముకుందం.

''ఏం...ఏమంటాడు?''

''నేనేదో పని చెయ్యకుండా కంపెనీ సొమ్ము తినేస్తున్నట్టుగా మాట్లాడుతాడు. నిన్నగాక మొన్న చేరిన వాళ్ళతో పోల్చి వాళ్ళలా స్పీడ్‌గా పని చెయ్యడం లేదంటాడు. ఈ వయస్సులో అది సాధ్యమా...నువ్వే చెప్పు...తినేస్తున్నాడనుకో''

''నువ్వు చెప్పింది నిజమే. కానీ, అటునుంచి ఆలో చిస్తే... వాళ్ళ ఇబ్బందులు వాళ్ళకున్నాయి. మనం ఏది కొన్నా నాణ్యత చూసే కొంటాం. కానీ, మేనేజర్లకి ఆ ఛాన్సుండదు. ఎన్ని తిప్పలు పడైనాసరే, తనకి కేటాయించిన స్టాఫ్‌తోనే గోల్స్ సాధించాల్సిన పరిస్థితులు వస్తుంటాయి. నిన్నేదో కించపరుస్తున్నాననుకోకు. వయస్సు తోపాటు అనుభవం పెరుగుతుంది. వేగం మందగిస్తుంది. కానీ, నీలాంటి సీనియర్లని కదిలించడం కష్టం. తప్పనిసరై భరించాల్సిన పరిస్థితులు ఇబ్బందిని కలిగిస్తాయి.''

''మొత్తానికి నువ్వు కూడా నన్ను పనికి మాలిన వాడిగా ట్రీట్ చేస్తున్నావన్నమాట. ఇప్పుడు నేను కుర్రవాళ్ళలా పని చెయ్యలేకపోవచ్చు. కానీ, ఒకప్పుడు ఆఫీసు ఒదిలేసరికి రాత్రి తొమ్మిదో, పదో అయ్యేది. జగన్నాథం గారిది మా ఊరే...

నీకు తెలుసుకదా. ఆయన నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయగూడదని ఒళ్ళుపై తెలియ కుండా కష్టపడ్డాను. అప్పట్లో ఇన్ని డిపార్ట్‌మెంట్లు, వర్క్ ఎలొకేషన్సు లేవు., ఎవరైనా, ఏ పనైనా చెయ్యాల్సిందే. రాత్రిళ్ళు లేటై వర్కర్స్ వెళ్ళిపోతే అన్నీ నేనే సర్దుకుని, తాళాలు పెట్టుకుని, వెళ్ళిన రోజులున్నాయి. దాదాపు ఇరవయ్యో ఏట నుండి ఈ కంపెనీ నాది అన్నంతగా తాపత్రయపడ్డాను. నా కుటుంబంతో ఆనందంగా గడపాల్సిన ఎన్నో సాయంత్రాలని కంపెనీ కోసం ధారబోసాను. ఈరోజున, అప్పటి నా కష్టం, అనుభవం అన్నిటినీ తీసిపారేసి మాట్లాడుతున్నారు. ఈ విషయమై ఒకసారి మా ఎమ్.డి. గారిని కలిసి మాట్లాడాలను కుంటున్నాను. ఆయనకు నా గురించి బాగా తెలుసు''

''అది అనవసర ప్రయత్నమని నా ఉద్దేశ్యం. మేనేజ్ మెంట్ అభిప్రాయాలని తన భాషలో చెప్పేవాడే మేనేజర్. వాళ్ళందరి ఆలోచనా విధానం ఒకేలా ఉంటుంది. వాళ్ళకి పరిగెత్తే గుర్రాలే కావాలి. అక్కడ సెంటిమెంట్లకి తావులేదు. నీకిచ్చే జీతంలో సగానికే నీకన్నా ఎక్కువ పనిచేసేవాడు దొరుకుతున్నాడు. ఇంక నీ అనుభవం అంటావా... ఒకోసారి అది మేనేజర్లకి పంటికింద రాయిలా తగుల్తుందని నీకు తెలుసా?

నువ్వు ఒకప్పుడు ఈ కంపెనీకి ఎస్సెట్ అయి ఉండవచ్చు. కానీ, ప్రస్తుతం కంపెనీలన్నీ నిరర్ధక ఆస్తుల్ని వదుల్చుకోవాలనే చూస్తున్నాయి''

''చాలా దారుణంగా మాట్లాడుతున్నావు''

''నేను వాస్తవం చెబుతున్నాను. గతంలోని నీ కష్టాన్ని మీ మేనేజర్ గుర్తించలేదని బాధపడుతున్నావు. మా అబ్బాయే నా కష్టం గుర్తించకుండా నాకేం ఇచ్చావని అడుగుతున్నాడు. 'కనీసం ఒక సైట్ కూడా కొనుంచలేదు. అప్పట్లో బాగా చవక కదా' అంటాడు. అప్పట్లో మన జీతాలు కూడా అంతంత మాత్రమే కదా. మా అమ్మ, నాన్నతో కలిపి కుటుంబంలో ఏడుగురం ఉండేవాళ్ళం. అందర్నీ పోషించి, పిల్లల చదువులు, పెద్దవాళ్ళ వైద్య ఖర్చులు భరించి, ఇద్దరమ్మాయిల పెళ్ళిచేసేసరికి నా శక్తి ఉడిగిపోయింది. ఏ వ్యసనాలూ లేవు కాబట్టి అప్పులు లేకుండా బైటపడ్డాం. అదే పదివేలు అని నేను అనుకుంటాను. అన్నీ తెలిసిన మా అబ్బాయి పదేపదే నాకేం మిగిల్చావు అని అడుగు తుంటే ఏం చెప్పాలో తెలియడం లేదు''

ఆవేదనగా అన్నాడు రాజారావు.

''మీ అబ్బాయిని ఇంజనీరింగ్ చదివించడానికి నువ్వెన్ని ఇబ్బందులు పడ్డావో నాకు తెలుసు. ఈరోజు తను వేలకివేలు సంపాదిస్తున్నాడంటే దానికి కారణం అప్పటి నీ కష్టం. గతాన్ని మరిచిపోయి మాట్లాడటం మూర్ఖత్వం. ఆ పునాది మీదే వర్తమానం నిలబడింది''

''అది మన ఆలోచనా విధానం. కానీ, దానికి కాలం చెల్లింది. ఆ తరానికి గతంతో నిమిత్తంలేదు. వీళ్ళ డిక్షనరీలో నిన్న అనేది లేదు. మా తాతలు నేతులు తాగారు అనే కుర్రవాళ్ళని ఈరోజు నువ్వు చూడలేవు. మనదేశ పూర్వవైభవం గురించి ఎవరైనా చెబుతుంటే వింటున్నకొద్దీ వినాలనిపించేది. ఈరోజు అలాంటి కబుర్లు చెబితే ఎవరు వింటారు? అదే...భవిష్యత్తులో మన దేశం సాధించబోయే విజయాల గురించో, వివిధ రంగాల్లో రాబోయే ఉద్యోగ అవకాశాల గురించో చెప్పు... వింటారు. వ్యాపార రంగంలో గలగలలాడ బోయే కాసుల సవ్వడిని వినిపించు... ఆనందిస్తారు. మనది కలల్ని నెమరువేసుకునే ప్యూపా దశ. ఈ తరానిది కలల్ని నిజం చేసుకునే సీతాకోకచిలుక దశ.

అంతెందుకు...మనదేశ చరిత్రలోనే మహత్తర ఘట్టమైన స్వాతంత్ర్య సంగ్రామం కొద్దికాలంలోనే అంకెలలోకి, తారీఖులలోకి కుదించబడి చారిత్రక పుటలలో మిగిలిపోబోతోంది. ఆనాటి త్యాగాలను తలుచుకుని అబ్బురపడే స్థితిని మనం దాటి పోబోతున్నాం''

''ప్రతిఫలం అనుభవిస్తూ కారకుల్ని విస్మరించడం దారుణం''

ఎవరికి వారు తమ బాధ్యతని నెరవేర్చి తప్పుకోవాలేకానీ దారికి అడ్డుగా నిలబడతానంటే కుదరదు. పండుని తినేటప్పుడు వేరుని గురించి ఆలోచిస్తున్నామా? ఇదీ అంతే. కష్టకాలంలో తప్ప సుఖాలలో ఉన్నప్పుడు మూలాల చింత ఎవరికి పట్టింది? ఇది మనలాంటి వాళ్ళకి బాధాకరంగా అనిపించినా... అనివార్యం'' అన్నాడు రాజారావు నిట్టూర్చి.

***

ముకుందానికి అస్తిమితంగా ఉంది. మేనేజర్ వైఖరి రోజురోజుకి భరించలేనిదిగా తయారవుతోంది. ఆఫీస్‌కి వెళ్ళడమే శిక్షగా అనిపిస్తోంది. ఆరోజైతే మరీ దారుణంగా మాట్లాడాడు. కొడుకుతో ఒకసారి మాట్లాడి నిర్ణయం తీసుకుంటే మంచిదనిపించి కొడుక్కి రింగ్‌చేసాడు.

''హలో...రాజేష్ హియర్''

''నేనురా... ఎలా ఉన్నావు?''

''మీరా డాడీ... ఈటైంలో ఫోన్ చేసారేమిటి?'' కంగారుగా అన్నాడు.

''అబ్బే..కంగారు పడాల్సిందేమీలేదు''

''అయితే డాడీ... ఒక్క క్షణం లైన్లో ఉండండి... ఎంతకాలమైంది మీకీ పనిచెప్పి''

''.....''

''అలాంటి కారణాలు చెప్పొద్దన్నానా. పనవక పోతే ఎక్స్ట్రా టైం ఉండి కంప్లీట్ చెయ్యండి''

''......''

''ఏజ్ పర్మిట్ చెయ్యకపోతే రిజైన్ చేసి, ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకోండి. అంతే కానీ వర్క్ పెండింగ్ పెడతానంటే కుదరదు. ఎలా చేస్తారో నాకు తెలియదు. వనవర్లో స్టేట్‌మెంట్ నా టేబుల్ మీద ఉండాలి... ఆ... చెప్పండి డాడీ''

ముకుందానికి ఏం మాట్లాడాలో తోచలేదు.

''బిజీగా ఉన్నట్లున్నావు. మళ్ళీ ఫోన్ చేస్తాలే'' సెల్ స్విచ్ ఆఫ్ చేసాడు

*